# ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న శరణార్థులు !

## (20 జూన్ "ప్రపంచ శరణార్థి దినం" సందర్భంగా)

యుద్ధాలు, సంక్షోభాలు, హింసలు, పీడించడం, వాతావరణ ప్రతికూల మార్పులు, జాతి వివక్షలు, మత విద్వేషాలు, జాతీయత, కొన్ని సామాజిక లేదా రాజకీయ సంఘాల్లో సభ్యత్వాల కారణంగా ప్రాణ భయంతో మరో దేశానికి వెళ్లి శరణు కోరి ప్రాణాలు కాపాడుకునే ప్రత్యేక వ్యక్తులు లేదా సమూహాలను శరణార్థులుగా నిర్వచిస్తాం. నేరుగా మరో దేశంలో శరణార్థులుగా చేరే వారు, ఆశ్రమం పొందే వారు, అంతర్గతంగా స్థానభ్రంశం పొందిన వారు, ఏ దేశానికి చెందని వారు, అనేక ఏళ్ల తర్వాత తిరిగి తమ దేశానికి చేరి వారందరూ శరణార్థుల జాబితాలో వస్తారు.

శరణార్థులు, వారి పిల్లలు పడుతున్న అమానవీయ వేదనలను గుర్తించి ఐరాస తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏట 20 జూన్ రోజున "ప్రపంచ శరణార్థి దినం (వరల్డ్ రెఫ్యూజీ డే)"ను 2001 నుంచి పాటించడం జరుగుతోంది. మరో దేశం నుంచి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వచ్చిన శరణార్థులు కూడా సాధారణ మానవులే అని, వారికి కూడా కనీస మానవ హక్కులు వర్తిస్తాయని, వారితో ధైర్యాన్ని నింపడం, వారి పిల్లలకు విద్య వసతులు విస్తరించాలని, ఆకలి చావుల కోరల్లో చిక్కకుండా చూసుకోవాలని ప్రపంచ దేశాలకు అవగాహన పరచడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. 2025 ప్రపంచ శరణార్థి దినం ఇతివృత్తంగా "శరణార్థులకు సంఘీభావం ఉందాం" అనే అంశాన్ని నిర్ణయించారు. 2025 శరణార్థి వారం ఇతివృత్తంగా "సూపర్ పవర్‌గా పౌర సమాజం" అనే అంశాన్ని తీసుకున్నారు. శరణార్థులను కూడా సాధారణ పౌరులుగా చూడాలని, శత్రువులుగా భావించ వద్దని ఐరాస సూచిస్తున్నది. శరణార్థుల పట్ల సహానుభూతి చూపడం, కనీస మానవ హక్కులను కల్పించడం, వారికి సంఘీభావంగా ప్రచారాలు నిర్వహించడం, వారి జీవిత కథలను వినడం, వారి అనుభవాలను అర్థం చేసుకోవడం, వారి పట్ల రాజకీయ ఏకీకరణ జరగడం, వారి అభ్యున్నతికి నిధులు కేటాయించడం, వారి మనోభావాలను అర్థం చేసుకోవడం లాంటివి నిత్యం కొనసాగాలి.

### భారత్‌లో శరణార్థుల సమస్యలు:

భారత్‌లోకి శ్రీలంక, మియాన్మార్, అఫ్ఘానిస్థాన్, చిబెట్, బంగ్లాదేశ్ లాంటి ఇరుగు పొరుగు దేశాల నుంచి వేల మంది శరణార్థులు భారత భూభాగంలోకి శరణార్థులుగా చేరడం కొనసాగుతున్నది. శ్రీలంకన్ తమిళులు, రెహింగ్యాలు, టిబెటన్లు, చక్మా–హజోంగ్‌లు, జూయిష్ వర్గాలు అధిక సంఖ్యలో భారత్‌కు రావడం, శరణార్థులుగా జీవితాలను కొనసాగించుకోవడం జరుగుతూ కొన్ని సార్లు మన దేశంలో శాంతి భద్రతల సమస్యలకు కూడా కారణం అవుతున్నారని కూడా భావించడంతో జరుగుతోంది. 2022 వివరాల ప్రకారం భారత్‌లో 46,000 మంది, అందులో 22,509 మంది రొహింగ్యాలు కూడా శరణార్థులు నమోదు అయినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. భారత్‌లో చేరిన శరణార్థులు అధిక శాతం పట్టణ ప్రాంతాల్లో స్థిరపడి అసంఘటిత పనుల్లో నిమగ్నం అవుతున్నారు. శరణార్థి కుటుంబాలకు చెందిన పిల్లలు 7 శాతం మాత్రమే విద్య కొనసాగిస్తున్నారని, 87 శాతం శరణార్థులు అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లోనే జీవిస్తున్నారని తెలుసుకోవాలి.

ప్రపంచ శరణార్థి దినం వేదికగా నిజమైన శరణార్థులను గుర్తించి వారికి కనీస వసతులను కల్పించడం, దురుద్దేశంతో భారత్‌లోకి చేరిన శరణార్థులను ఏరిపారేయడం నిరంతరం జరగాలి. నిస్సహాయ స్థితుల్లో శరణార్థులుగా చేరిన వారి కుటుంబాలకు కనీస అవసరాలు తీర్చడం, సహానుభూతితో వారికి గొడుగు పట్టడం, వారి పిల్లలకు చదువుకునే అవకాశాలు కల్పించడం, మానవీయ కోణంలో అక్కున చేర్చుకోవడం, వారికి వైద్య ఆరోగ్య వసతులు కల్పించం, వారిని మానవులుగా గౌరవించడం, సమానత్వ భావనలను ఆచరించడం, కనీస సహకారాలను అందించడం కొనసాగాలి. ఊహించని సందర్భాల్లో పరాయి దేశంలోకి చేరిన శరణార్థులకు మానవ హక్కుల గొడుగు పడదాం, వారి శ్రేయస్సుకు పాటు పడదాం.



–డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# నటుడు కాంతారావు కుమారుడికి యండమూరి ఆర్థిక సహాయం



హైదరాబాద్, జూన్ 19:దివంగత నటుడు కాంతారావు కుమారుడు రాజా ఆర్థిక పరిస్థితి తెలుసుకుని అతనికి రచయిత యండమూరి వీరేంద్రనాథ్ సాయం అందజేశారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించిన గద్దర్ సినిమా అవార్డుల వేడుకలో తనకు ప్రకటించిన రఘుపతి వెంకయ్య అవార్డు, నగదు బహుమతి తీసుకుంటున్న సందర్భంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి "మీ బహుమతి మొత్తంలో చాలా భాగం వివిధ సేవా కార్యక్రమాలను అందజేస్తాను" అని వేదిక మీదే చెప్పినట్టు యండమూరి సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆ ప్రకారం కడప ఆర్తి ఫౌండేషన్ కు. రూ.3 లక్షలు, శ్రీకాకుళం సమీప గ్రామంలో నిర్వహిస్తున్న అనాథ విద్యార్థులకు సహాయం నిమిత్తం అభయ ఫౌండేషన్‌కు రూ.లక్ష ఇవ్వడం జరిగింది.

నటుడు కాంతారావు కొడుకు రాజా (రాజేశ్వరరావు) అద్దె కట్టడానికి కూడా వెతుక్కునే పరిస్థితిలో ఉన్నాడని తెలిసి, అతడికి రూ.లక్ష ఇవ్వడం జరిగిందని యండమూరి పేర్కొన్నారు. సినీ అవార్డుల్లో కాంతారావు (ఐజీనిబిజీటీజీనీ) పేరు మీద ప్రత్యేక అవార్డును, పది లక్షల రూపాయల బహుమతిని నటుడు విజయ్ దేవరకొండకు అందజేసిన విషయం తెలిసిందే. ఈ వేడుకను వీక్షించేందుకు కాంతారావు కుటుంబాన్ని ఆహ్వానిస్తూ ఖర్చుల కోసం రూ.వెయ్యి నిర్వాహకులు వారికి పంపించారని యండమూరి వీరేంద్రనాథ్ తెలిపారు.

# జీ7 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా జర్మనీ ఛాన్సలర్‌తో భారత ప్రధాని భేటీ

న్యూఢిల్లీ, జూన్ 19:కెనడాలోని కననాస్కిస్‌లో జీ7 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా గౌరవ జర్మనీ ఛాన్సలర్ శ్రీ ఫ్రెడరిక్ మెర్జ్‌తో భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు సమావేశమయ్యారు. ఈ ఏడాది మే నెలలో ఛాన్సలర్ గా మెర్జ బాధ్యతలు స్వీకరించిన అనంతరం వారిద్దరూ భేటీ కావడం ఇదే మొదటిసారి. ఎన్నికలలో విజయం సాధించి, పదవీ బాధ్యతలు స్వీకరించిన జర్మనీ ఛాన్సలర్‌ను భారత ప్రధానమంత్రి అభినందించారు. గతవారం అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంపై జర్మనీ ప్రభుత్వం సానుభూతి వ్యక్తం చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ద్వైపాక్షిక సంబంధాల్లో పురోగతి స్థిరంగా కొనసాగుతుండడంపై వారిద్దరూ హర్షం వ్యక్తం చేశారు. వాణిజ్యం – పెట్టుబడి, రక్షణ – భద్రత, హరిత – సుస్థిరాభివృద్ధి భాగస్వామ్యం, హరిత ఇంధనం, సాంకేతికత, ఆవిష్కరణలు, విద్య, మొబిలిటీ వంటి కీలక రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి ఇరుదేశాలూ కట్టుబడి ఉన్నాయని పునరుద్ఘాటించారు. భారత్ – జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యానికి 25 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో దానిని మరింత విస్తృతం చేసుకునేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయి.

ప్రపంచంలో శాంతి, సుస్థిరతలకు ఉగ్రవాదం పెనుముప్పుగా పరిణమించిందని ఇరువురు నేతలు అంగీకరించారు. ఉగ్రవాదంపై పోరులో భారత్ తీసుకున్న చర్యలకు జర్మనీ బలమైన సంఘీభావం, మద్దతు తెలిపినందుకు ఛాన్సలర్ మెర్జ్‌కు ఈ సందర్భంగా శ్రీ మోదీ ధన్యవాదాలు తెలిపారు.

ముఖ్యమైన ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై వారిద్దరూ చర్చించారు. వీలు చూసుకుని భారత్‌లో పర్యటించాలని, మెర్జ్‌కు భారత్‌లో స్వాగతం పలికేందుకు ఎదురుచూస్తున్నట్లు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చెప్పారు.

# ఐడీవై-2025కు ముందే భారత యోగా దౌత్యాన్ని ప్రదర్శించిన యోగా బంధన్

న్యూఢిల్లీ, జూన్ 19:అంతర్జాతీయ యోగా దినోత్సవం (ఐడీవై)–2025 వేడుకల్లో భాగంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో.. మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా (ఎమ్‌డీఎన్‌ఐవై) ఈరోజు ప్రపంచ 'యోగా బంధన్' ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఐడీవై–2025 సందర్భంగా నిర్వహిస్తున్న 10 ప్రధాన కార్యక్రమాల్లో ఒకటైన ఈ కార్యక్రమం.. వివిధ సంస్థల మధ్య సహకార ఒప్పందాల ద్వారా యోగా రంగంలో ప్రపంచ సహకారాన్ని బలోపేతం చేయడం పట్ల భారత్ నిబద్ధతను స్పష్టం చేసింది.

'యోగా బంధన్' ప్రపంచవ్యాప్తంగా ఉన్న యోగా ప్రచారకర్తలందరిని ఒకే వేదికకు చేర్చింది. సాంస్కృతిక మార్పిడి, విద్యాసంబంధ చర్చలకు, యోగా ద్వారా ప్రపంచ శ్రేయస్సును సాధించాలనే సమష్టి దార్శనికతను స్పష్టం చేసే చక్కని వేదికగా ఈ కార్యక్రమం నిలిచింది. 15 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న యోగా గురువులు, అభ్యాసకులు, స్టూడియో నిర్వాహకులు, రచయితలు, ఆరోగ్య నిపుణులు సహా ప్రముఖ అంతర్జాతీయ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రారంభ సమావేశానికి ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కోటేచా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ ఆరోగ్య చర్చలో యోగాను ముందంజలో ఉంచడంలో భారత్ దార్శనిక నాయకత్వాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఓ) విడుదల చేసిన డేటాను ప్రస్తావిస్తూ, దేశంలోని గ్రామీణ, పట్టణ జనాభాలో దాదాపు 95 శాతం మందికి ఆయుష్ వ్యవస్థల గురించి అవగాహన ఉందన్నారు. వీరిలో దాదాపు 35 శాతం జనాభా ఏదో ఒక రూపంలో యోగాను ఉత్సాహంగా సాధన చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

వివిధ దేశాల్లో పర్యటించిన తన అనుభవాలను ప్రస్తావిస్తూ, యోగాను ప్రపంచవ్యాప్తంగా సాధన చేస్తున్నారని శ్రీ కోటేచా వ్యాఖ్యానించారు. ఐడీవై–2025 సందర్భంగా నిర్వహిస్తున్న హరిత్ యోగా, యోగా కనెక్ట్, సమ్‌యోగా వంటి కీలక కార్యక్రమాలను వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 3.3 లక్షలకు పైగా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. జూన్ 21న ఐడీవై–2025 ప్రధాన కార్యక్రమం జరిగే సమయానికి నిర్వహించిన ఈ మొత్తం కార్యక్రమాల సంఖ్య 5 లక్షలకు పెరిగే అవకాశం ఉందనే అంచనాలను ఆయన ప్రస్తావించారు.

# సీఎం వ్యాఖ్యలను నిరూపిస్తే రాజకీయ సన్యాసం- ఈటల



హైదరాబాద్, జూన్ 19: కాళేశ్వరం వంటి పెద్ద ప్రాజెక్టు నిర్మాణం కేబినెట్ ఆమోదం లేకుండా నిర్మించారని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ఈ రోజు మధ్యాహ్నం మీడియాతో మాట్లాడుతూ.. కేబినెట్ ఆమోదం లేకుండా కాళేశ్వరం కట్టారని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ కేబినెట్‌లో చర్చించకుండా ఏ నిర్ణయం తీసుకోలేదని, ఒక వేళ నిర్ణయం తీసుకున్న కేబినెట్ ఆమోదం తీసుకుంటారని.. తాను బీజేపీ ఎంపీగా కాకుండా నాటి మంత్రిగా చెబుతున్నానని ఎంపీ ఈటల స్పష్టం చేశారు.

కేబినెట్ ఆమోదం లేకుండా కాళేశ్వరం లాంటి పెద్ద ప్రాజెక్టు కట్టిన సంఘటన దేశంలో ఎక్కడైనా ఉందా అని ఈటల ప్రశ్నించారు. కేసీఆర్ కేబినెట్ లో మంత్రులుగా పనిచేసి ఇప్పుడు మీ పక్కనే ముగ్గురు ఉన్నారని, వారిని అడిగి తెలుసుకోండి అని సలహా ఇచ్చారు. ఇలాంటి కీలక అంశాలపై కేబినెట్ ఆమోదం లేకుండా కేసీఆర్ ఎప్పుడు నిర్ణయాలు తీసుకోలేదని స్పష్టం చేశారని అన్నారు.

# ప్రతిపక్షంలోనూ మారని జగన్ వైఖరి : కన్నా లక్ష్మీనారాయణ

అమరావతి, జూన్ 19: ప్రతిపక్షంలోనూ ఏపీ వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి అరాచక వైఖరి మారలేదని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ మండిపడ్డారు. జగన్ శవరాజకీయాలు చేస్తున్నారన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ హయాంలోనే నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకున్నారని, నాగమల్లేశ్వరరావు చనిపోయింది గతేడాది జూన్ 9న అని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చింది గతేడాది జూన్ 12 తేదీన అని చెప్పారు. పోలీసుల వేధింపుల వల్లే ఆత్మహత్య అంటూ వైసీపీ దుష్ప్రచారం చేస్తుందని కన్నా లక్ష్మీనారాయణ దుయ్యబట్టారు.

# విద్యుత్ షాక్‌తో లైన్ మెన్‌కు తీవ్రగాయాలు

అమరావతి, జూన్ 19: మండల పరిధిలోని జమాల్ పురం గ్రామంలో లైన్ మెన్ బాధవత్ బాలు విద్యుత్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ సరఫరా కావడంతో షాక్ కు గురై తీవ్ర గాయాలయ్యాయి.

స్థానికులు గమనించి వెంటనే 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం వరంగల్ యంజియం హాస్పిటల్ కి తరలించారు.

అయితే పరిస్థితి విషమించడంతో అక్కడి నుండి హైదరాబాద్ కు తరలించినట్లు సమాచారం. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.






# చెత్త సేకరణలో విద్యుత్తు వాహనాల (ఈవీస్) చేరిక పట్టణ స్వచ్ఛ భారత్ పథకం(ఎస్‌బీఎమ్-యూ)లో గణనీయ మార్పులకు సూచిక

న్యూఢిల్లీ, జూన్ 19:స్వచ్ఛ, హరిత భారత్ ఆశయ సాధనలో భాగంగా, ఇంటి చెత్త సేకరణ విధుల్లో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీస్)ను ప్రవేశపెట్టారు. దీంతో స్వచ్ఛ భారత్ మిషన్– అర్బన్ (ఎస్‌బీఎమ్–యూ)లో ఓ గణనీయ మార్పునకు నాందీప్రస్తావన చేసినట్లయింది. ఈ హరిత వాహనాలు రాబోయే కాలంలో పట్టణ ప్రాంతాల్లో దీర్ఘకాలిక ప్రాతిపదికను కలిగి ఉండే తరహా పారిశుద్ధ్య ముఖచిత్రాన్ని ఆవిష్కరించగలవు. ఈ ఈవీస్ రోజువారీ వ్యర్థాల సమస్యను సమర్ధంగా పరిష్కరిస్తూనే, అదే సమయంలో వాయు కాలుష్యాన్ని, శబ్ద కాలుష్యాన్ని తగ్గించనున్నాయి. సంప్రదాయ ఇంధనంతో నడుస్తున్న చెత్త వాహనాల స్థానంలో విద్యుత్తు వాహనాలు రావడం వల్ల కర్బన ఉద్గారాలను తగ్గడమే కాకుండా నగరాలను శుభ్రంగా ఉంచాలన్న ఎస్‌బీఎమ్–యూ లక్ష్యానికి అనువుగా ఉన్నాయి. పొగకు తావు ఉండని రవాణా సాధనాలతో పాటే ఘన వ్యర్థాల నిర్వహణ.. ఈ రెండిటి మేలుకలయిక పర్యావరణ పరంగా మరింత బాధ్యతాయుత భవిష్యత్కాలానికి బాట వేస్తోంది.

ఇళ్ల నుంచి చెత్తను సేకరించడానికి 200కు పైగా విద్యుత్తు ఆటోలను రంగంలోకి దించి వ్యర్థాల నిర్వహణలో పర్యావరణానుకూల మార్పునకు ఆంధ్ర ప్రదేశ్‌లోని గుంటూరు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమానికి, సస్టెయినబుల్ సిటీస్ ఇంటిగ్రేటెడ్ పైలట్ అప్రోచ్ (ఎస్‌సీఐఏపీ)లో భాగంగా ఐక్యరాజ్యసమితి పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (యూఎన్‌ఐడీఓ)తో పాటు గ్లోబల్ ఎన్విరాన్ మెంటల్ ఫెసిలిటీ (జీఈఎఫ్) మద్దతు అందిస్తోంది. వాస్తవ–కాల ప్రాతిపదికన పర్యవేక్షణ కొనసాగాలన్న ఉద్దేశంతో ఈ విద్యుత్తు ఆటోల్లో జీపీఎస్ ట్రాకింగు జోడించారు. ఈ ఆటోలు నగర పరిధిలో మొత్తం 159.46 కి.మీ చుట్టి వస్తున్నాయి. ఏటా 71,000 లీటర్లకు పైగా డీజిల్ వినియోగించాల్సిన అవసరాన్ని నివారించడం ద్వారా, ఈ ప్రాజెక్టు గ్రీన్ హౌస్ గ్యాస్ ఉద్గారాలను చాలావరకు తగ్గించగలుగుతుంది. పది సంవత్సరాల కాలంలో రమారమి 21,000 టన్నుల ఉద్గారాలు వెలువడే ప్రమాదం ఇక ఉండదని ఒక అంచనా. వాయు నాణ్యతను పెంచనుంది. నిర్వహణ ఖర్చులు తగ్గడంతో పాటు సాంప్రదాయక చెత్త లారీలతో పోలిస్తే విద్యుత్తు ఆటోలు మరింత ఎక్కువ కాలం పనిచేయగలిగేవి కావడంతో, ఈ రకం వాహనాలు వ్యర్థాల నిర్వహణకు నగరపాలక సంస్థ పెట్టాల్సిన ఖర్చును ఆదా చేసే మార్గాన్ని చూపగలుగుతాయి. దీనికి అదనంగా, ఈ కార్యక్రమం ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటుగా సేవలో విశ్వసనీయతను మెరుగుపరిచి, మొత్తంమీద పట్టణ సుస్థిరత్వానికి దన్నుగా కూడా నిలుస్తుంది.

నగరం అంతటా చెత్త సేకరణకు బ్యాటరీతో తిరిగే ఎలక్ట్రిక్ రిక్షాలను గ్రేటర్ చెన్నయ్ కార్పొరేషన్ (జీసీసీ) ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమం పర్యావరణ అనుకూల అభివృద్ధి సాధన లక్ష్యానికి అనుగుణంగా ఉండడం ఒక్కటే కాకుండా వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం వంటి నగర ప్రాంతాల్లోని కీలక సవాళ్లను కూడా పరిష్కరించగలుగుతుంది. ఇ–రిక్షాలు ప్రతి రోజూ ఇంచుమించుగా 40 కి.మీ ప్రయాణించగలవు. డీజిల్‌తో నడిచే లారీలకు బదులుగా ఇ–రిక్షాలు రంగంలోకి రావడంతో, నగరం ప్రతి రోజూ దాదాపు 41 టన్నుల కర్బన ఉద్గారాల బారి నుంచి తప్పించుకోగలుగుతుంది. ఏడాది కాలానికయితే ఇది 15,160 టన్నులుగా లెక్కకు వస్తుంది. ఇళ్లు, వాణిజ్య భవనాలు, నివాసేతర ప్రాంతాల నుంచి చెత్తను రోజూ పోగు చేసి తీసుకుపోవడానికి వీలుగా ఎలక్ట్రిక్ వాహనాలను ప్రత్యేకంగా తయారు చేశారు.

తడి చెత్త, పొడి చెత్తలతో పాటు అపాయకార వ్యర్థాల కోసం వేర్వేరు కుండీలను అమర్చిన ఈ ఇ–రిక్షాలు మూలం వద్దే చెత్తను వేరు చేసేందుకు తగిన ఏర్పాట్లను కూడా కలిగి ఉన్నాయి. ప్రస్తుతం, 5,478 ఇ–రిక్షాలను జీసీసీ నిర్వహిస్తోంది. ఇవి నగరంలోని మొత్తం 15 మండలాల్లో 24,621 వీధుల నుంచి చెత్తను తరలించడం ద్వారా 2 కోట్ల 10 లక్షల కుటుంబాలకు సేవలను అందిస్తున్నాయి. ఈ సమగ్ర వ్యవస్థ బహుళ ప్రయోజనాలను అందిస్తోంది. పెట్రోలు–డీజిల్ వంటి సాంప్రదాయక ఇంధనాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గిపోవడం, నిర్వహణ– మరమ్మతు ఖర్చులు తక్కువ కావడం సున్నా స్థాయి ఉద్గారాల వల్ల పర్యావరణానికి కలిగే మేలు చాలా ఎక్కువ. ఈ కార్యక్రమంతో 6,000 మందికి పైగా ఉపాధి లభిస్తోంది. ఇ–రిక్షాలలో శ్రవణ వ్యవస్థల (ఆడియో సిస్టమ్స్)ను జతపరచారు. దీంతో వివిధ వ్యర్థ పదార్థాలను వేరు చేసి అట్టిపెట్టడం ముఖ్యమంటూ ప్రత్యేక పాటలు, సార్వజనిక సమాచార ప్రచారం ద్వారా నగరవాసులను జాగృతం చేయడానికి కూడా వీలవుతోంది.

ఇంటి చెత్త సేకరణకు వాడుతున్న డీజిల్ వాహనాలకు బదులు 100 విద్యుత్తు వాహనాలను (ఇ–వెహికిల్స్)ను ఇండోర్ నగరపాలక సంస్థ ప్రవేశపెట్టి, పర్యావరణ స్థిరత్వంతో పాటుగా నిర్వహణ కార్యకలాపాల సామర్థ్యం దిశగా ఒక పెను మార్పునకు చొరవ తీసుకొంది.

ఈ కార్యక్రమం, నగరంలోని రాజ్‌వాడా వంటి ప్రధాన ప్రాంతాలపై శ్రద్ధ తీసుకొంటూ, ఒక సంవత్సరంలో వాతావరణంలోకి చొరబడుతున్న కర్బన ఉద్గారాలను సుమారుగా 24,918 టన్నుల మేరకు తగ్గించడం లో తన వంతుగా తోడ్పాటును అందిస్తోంది.

అంతేకాదు, చెత్త రవాణాకు అవసరమయ్యే ఇంధనంతో పాటు నిర్వహణ ఖర్చులు గణనీయంగా తగ్గడానికి కూడా దోహదపడుతోంది. సమీకృత కమాండ్, కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) పర్యవేక్షణలో వాస్తవ–కాల జీపీఎస్ ఊతం లభిస్తూ ఉండడంతో, ఈ వాహనాలు పారదర్శక సేవలనూ, జవాబుదారీతనాన్నీ పెంపొందించగలుగుతాయి. డీజిల్ వాహనాలకు స్వస్తి పలకడంతో ఇంధనానికీ, ఇంజిన్ ఆయిల్‌కూ, క్లచ్ మార్పిళ్లకూ నగరపాలక సంస్థ పెట్టవలసి వచ్చిన ఖర్చులతో పాటు మరమ్మతులను కూడా లెక్కలోకి తీసుకొంటే, ఏటా దాదాపు రూ.5.97 కోట్ల వరకు ఆదా అయ్యేందుకు అవకాశం ఉంది. హరిత ప్రధాన వాహనాలను దీర్ఘకాల ప్రాతిపదికన నడపడానికి నగరపాలక సంస్థ 20 సౌర చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. ఒక్కో స్టేషన్‌లోనూ 10 కేడబ్ల్యూ సౌర శక్తి ఫలకాలు అమర్చారు. వీటికి రోజుకు 800 యూనిట్ల నుంచి 1000 యూనిట్ల హరిత ఇంధనాన్ని అందించే సామర్థ్యం ఉంది. ఈ స్టేషన్లు నిత్యం 80 నుంచి 100 వాహనాలకు విద్యుత్తును సరఫరా చేయగలవు. దీంతో సాంప్రదాయక విద్యుత్తు వనరులపై ఆధారపడడం చాలావరకు తగ్గిపోతుంది.

గుంటూరు, చెన్నైతో పాటు ఇండోర్ వంటి నగరాలు ఈ తరహా మార్గదర్శక ప్రయత్నాలను చేపట్టి 'స్వచ్ఛ భారత్ మిషన్–అర్బన్'లో భాగంగా స్వచ్ఛ, ఆకర్షణీయ, మరింత సుస్థిర పట్టణ వ్యర్థపదార్థాల నిర్వహణ దిశగా ఒక ప్రభావవంత మార్పును ఆవిష్కరించే చొరవను తీసుకుంటున్నాయి.

విద్యుత్ వాహనాల వినియోగం, పునరుత్పాదక ఇంధనం, డిజిటల్ సాంకేతికతలు.. వీటి వైపు ఈ నగరాలు మొగ్గు చూపి పర్యావరణపరంగా ప్రతికూల ప్రభావాలను తగ్గించడం ఒక్కటే కాకుండా నిర్వహణ కార్యకలాపాల్లో సామర్థ్యాన్ని ఇనుమడింపచేయడంతో పాటు, సమాజ శ్రేయస్సుకు కూడా తమ తోడ్పాటును అందిస్తున్నాయి.

# లా సెట్ ఫలితాలు వెల్లడి

అమరావతి, జూన్ 19: న్యాయ విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ లాసెట్–2025, ఏపీ పీజీఎల్‌సెట్–2025 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. విద్యార్థులు తమ ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పరీక్ష రాసిన అభ్యర్థులు తమ ఫలితాలను cets.apsche.ap.gov.in/LAWCET/ అనే అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. హోమ్ పేజీలో కనిపించే లాసెట్ ఫలితాల లింక్‌పై క్లిక్ చేసి, తమ రిజిస్ట్రేషన్ నంబర్, లాసెట్ హాల్‌టికెట్ నంబర్ మరియు పుట్టిన తేదీ వివరాలను నమోదు చేయడం ద్వారా ర్యాంక్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అడ్మిషన్ల ప్రక్రియలో ఈ ర్యాంక్ కార్డు చాలా కీలకమైనది కాబట్టి దీన్ని భద్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు.

ఈ ఏడాది లాసెట్ పరీక్షల్లో మొత్తం 95 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు లోకేశ్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ పరీక్షలకు మొత్తం 27,253 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 20,826 మంది అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. మరోసారి బాలికలే టాపర్లుగా నిలిచి తమ ప్రతిభను చాటారని మంత్రి ప్రశంసించారు. పరీక్షలో విజయం సాధించిన విద్యార్థులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

రాష్ట్రంలోని న్యాయ కళాశాలల్లో మూడేళ్ల, ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీతో పాటు పీజీ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జూన్ 5వ తేదీన ఏపీ లాసెట్–2025 పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన విషయం విదితమే.

అంతేకాకుండా, ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మనమిత్ర' వాట్సాప్ సర్వీస్ ద్వారా కూడా ఫలితాలను సులభంగా తెలుసుకోవచ్చు. ఇందుకోసం 9552300009 అనే వాట్సాప్ గవర్నెన్స్ నంబర్‌కు 'ఊతి' అని మెసేజ్ పంపి, ఆ తర్వాత 'విద్యా సేవలు' ఆప్షన్‌ను ఎంచుకుని, 'ఏపీ లాసెట్ ఫలితాలు–2025' పై క్లిక్ చేయడం ద్వారా ర్యాంక్ కార్డును పొందవచ్చు.

లాసెట్ పరీక్షలో సాధించిన ర్యాంకులు, రిజర్వేషన్ల ఆధారంగా అభ్యర్థులకు కళాశాలల్లో సీట్లను కేటాయిస్తారు. ఫలితాలు వెలువడిన నేపథ్యంలో, ఉన్నత విద్యామండలి త్వరలోనే కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించనుంది. దీని ద్వారా దశలవారీగా సీట్ల కేటాయింపు ప్రక్రియ జరుగుతుంది.

# బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లేయర్‌తో నారా లోకేష్ భేటీ




న్యూఢిల్లీ, జూన్ 19:ఏపీ విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఢిల్లీలో రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా బ్రిటన్ మాజీ ప్రధాని , టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్(టీబీఐ) వ్యవస్థాపకుడు టోనీ బ్లేయర్‌తో మంత్రి సమావేశమయ్యారు. న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో టోనీని లోకేష్ కలుసుకుని పలు అంశాలపై చర్చించారు.

ప్రభుత్వ కార్యకలాపాలు, విద్యలో ఏఐ టూల్స్ వినియోగంపై ప్రధానంగా చర్చలు జరిగినట్లు సమాచారం. రాష్ట్రంలో అమలు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి ఎజెండా, స్కిల్ సెన్సస్ , దేశం వెలుపల యువతకు ఉపాధి వంటి అంశాల్లో టీబీఐ సాంకేతిక మద్దతుపై ఈ సమావేశంలో చర్చించారు. నైపుణ్య శిక్షణ అంశాలు, గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ స్థాపనకు సహకారంపై ఒప్పందం కుదిరింది. అలాగే ఉన్నత విద్యలో సంస్కరణలు, సాంకేతిక మద్దతుపై సమీక్ష నిర్వహించారు.

# కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌తో లోకేష్ భేటీ

న్యూఢిల్లీ, జూన్ 19: రాయలసీమ ప్రజల చిరకాల కోరిక అయిన హైకోర్టు బెంచ్ ఏర్పాటు విషయంపై కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌ను తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ న్యూఢిల్లీలో కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ, "రాయలసీమ ప్రజలకు న్యాయపరమైన సేవలు అందుబాటులోకి తీసుకురావాలంటే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అత్యవసరం. ప్రస్తుతం న్యాయ సహాయం కోసం 500 కిలోమీటర్లకు పైగా విజయవాడ వెళ్లాల్సిన పరిస్థితి రాయలసీమ ప్రజలకు తీవ్ర ఇబ్బందిని కలిగిస్తోంది. యువగళం పాదయాత్రలో వేలాది మంది ప్రజలు, న్యాయవాదులు హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోరుతూ విన్నవించారు" అని వివరించారు.

రాష్ట్రంలోని కోర్టుల మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరుతూ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌కు విజ్ఞప్తి చేసినట్లు లోకేష్ తెలిపారు. ఈ సందర్భంగా 'యువగళం' పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని కేంద్రమంత్రికి అందజేశారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటు అనేది ప్రజా సమస్యల పరిష్కారానికి కీలకం అని, న్యాయం అందరికీ సమానంగా అందాలంటే భౌగోళికంగా సమతుల్యత అవసరమని నారా లోకేష్ పేర్కొన్నారు.

# అమరావతిలో స్పోర్ట్స్ సిటీకి సహకారం అందించండి : నారా లోకేష్



న్యూఢిల్లీ, జూన్ 19:అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించే స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి సహకారం అందించాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు, కార్మిక, ఉపాధి శాఖల మంత్రి మన్సుఖ్ మాండవీయను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. న్యూఢిల్లీలో కేంద్రమంత్రి మన్సుఖ్ తో లోకేష్ భేటీ అయ్యారు.

ఈసందర్భంగా లోకేష్ మాటాడుతూ అమరావతిలో రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు. ఈ మేరకు లోకేష్ ఒక వినతిపత్రం అందజేశారు. క్రీడల అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. ప్రపంచస్థాయి శిక్షణ, సౌకర్యాలను కల్పించడం, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై వివిధ క్రీడావిభాగాల్లో అథ్లెట్లకు మద్దతు నివ్వడం స్పోర్ట్స్ సిటీ ప్రధాన లక్ష్యం. ఆంధ్రప్రదేశ్ ను స్పోర్ట్స్ హబ్ గా మార్చడానికి సహకారం అందించండి. రాష్ట్రంలోని పాఠశాలలు, గ్రామ స్థాయి నుంచి క్రీడల అభివృద్ధికి చేయూతనందించండి.

కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన గుంటూరు సమీపాన నాగార్జున యూనివర్సిటీ లో అథ్లెటిక్స్, ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్, కాకినాడ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్స్ లో హాకీ, షూటింగ్ లకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లను ఏర్పాటు చేయండి.

ఖేలో ఇండియా పథకంలో క్రీడా మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా 39 ప్రాజెక్టులకు సంబంధించి రూ.341.57 కోట్లతో ఏపీ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలకు త్వరితగతిన ఆమోదం తెలపండి. తిరుపతి లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రీజనల్ సెంటర్ ను ఏర్పాటు చేయండి. ఖేలో ఇండియాలో భాగంగా అథ్లెటిక్స్, రెజ్లింగ్ స్టేట్ లెవల్ సెంటర్ ను తిరుపతిలో నెలకొల్పండి. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో జిల్లాస్థాయి ఖేలో ఇండియా సెంటర్లను ఏర్పాటు చేయండి. దేశవ్యాప్తంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రైల్వే స్పోర్ట్స్ కన్సెషన్ పాస్ లను మంజూరు చేయండి, ఏపీలో ఈఎస్ఐ హాస్పిటల్స్ అభివృద్ధికి సహకరించాలని లోకేష్ విజ్ఞప్తి చేశారు.

కేంద్రమంత్రి మాండవీయ స్పందిస్తూ ఏపీని స్పోర్ట్స్ హబ్ గా మార్చేందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తాం, ఈఎస్ఐ హాస్పిటల్స్ (ఇూఎ ఉనీబజూతిబిజీశ్రీబ) సేవలను మరింత విస్తృత పరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయకు అందజేశారు.

# క్రొయేషియా రిపబ్లిక్ అధ్యక్షునితో ప్రధానమంత్రి భేటీ

న్యూఢిల్లీ, జూన్ 19:క్రొయేషియా రిపబ్లిక్ అధ్యక్షుడు శ్రీ జొరాన్ మిలనోవిచ్‌తో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు జాగ్రెబ్‌లో సమావేశమయ్యారు.

ద్వైపాక్షిక సంబంధాల్లో వివిధ అంశాలపై నేతలు ఇద్దరూ చర్చించారు. ప్రజాస్వామ్య విలువలు, చట్ట బద్ధ పాలన, అంతర్జాతీయ శాంతి-స్థిరత్వాల పరిరక్షణ కోసం కృషిచేస్తూ ఉండాలన్న ఉమ్మడి లక్ష్యంతోపాటు రెండు దేశాల సన్నిహిత మైత్రీ సంబంధాలను ఇకపైనా కొనసాగించాలన్న నిబద్ధతను పునరుద్ఘాటించారు. ద్వైపాక్షిక సహకారం- రక్షణ, అంకుర సంస్థలు, క్రీడలతో పాటు నవకల్పన వంటి సరికొత్త రంగాలకు కూడా విస్తరించినందుకు వారు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేస్తున్న పోరాటానికి క్రొయేషియా బలమైన మద్దతుతో పాటు సంఘీభావాన్ని తెలిపినందుకు అధ్యక్షుడు శ్రీ మిలనోవిచ్‌కు ప్రధానమంత్రి ధన్యవాదాలు పలికారు. నేతలు అనేక వందల సంవత్సరాలుగా రెండు దేశాలను గట్టిగా పెనవేసి ఉంచుతున్న సన్నిహిత సాంస్కృతిక అనుబంధాన్ని గురించి కూడా చర్చించారు.

పరస్పర ప్రయోజనాలతో కూడిన ప్రాంతీయ అంశాలతో పాటు ప్రపంచ అంశాలను కూడా చర్చించారు. భారత్-ఈయూ వ్యూహాత్మక భాగస్వామ్యం ఇటీవలి కాలాల్లో విస్తరించిన విషయాన్ని వారు గమనించారు. ఇది భారత్-క్రొయేషియా సంబంధాలకు అనేక విధాలుగా విలువను జోడించగలుగుతుందని వారు అభిప్రాయపడ్డారు.

# దేశ అంతరిక్షరంగంలో గత 11 ఏళ్ళలో జరిగిన గొప్ప మార్పులను తెలిపే వ్యాసాన్ని పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 19:గత 11 ఏళ్ళలో భారత అంతరిక్ష రంగం చేసిన పరివర్తనాత్మక ప్రయాణాన్ని వివరించే ఒక వ్యాసాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు పంచుకున్నారు. పాత పద్ధతుల నుంచి బయటపడి, ప్రజలకు అవసరమయ్యే ఆవిష్కరణలను చేపట్టిన వైనాన్ని గురించి చెబుతూ నేడు అంతరిక్ష సాంకేతికత ప్రజల దైనందిన జీవితాల్లో భాగమై రైతులకు సాధికారత, విద్యార్థులకు విజ్ఞానం, అభివృద్ధి చెందుతున్న రంగాలకు ఊతాన్ని అందిస్తోందని చెప్పారు."గత 11 ఏళ్ళలో భారత అంతరిక్ష కార్యక్రమంలో జరిగిన పరివర్తన గురించి కేంద్రమంత్రి విపులంగా తెలిపారు. సాహసోపేతమైన చర్యలతో, సమ్మిళిత దృక్పథంతో, ప్రజావసరాలే పరమార్థంగా పనిచేస్తున్న అంతరిక్ష సాంకేతికత, గ్రామాల్లోని రైతులు నుంచి తరగతి గదుల్లోని విద్యార్థుల వరకూ ప్రజల దైనందిన జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తోంది" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# ఫాస్ట్ ట్యాగ్ వార్షిక పాస్ ఇదో గేమ్ ఛేంజర్ : పవన్ కల్యాణ్



అమరావతి, జూన్ 19:జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఉపశమనం కలిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఫాస్ట్ ట్యాగ్ వార్షిక పాస్ వ్యవస్థ పట్ల ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చేసిన ఈ కీలక ప్రకటనను ఆయన స్వాగతించారు. ప్రయాణికులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ పాస్ విధానం రహదారి ప్రయాణాల్లో గణనీయమైన మార్పు తీసుకురాబోతుందంటూ పవన్ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో స్పందించారు.

రూ.3000తో సంవత్సరం పొడవునా ప్రయాణ సౌలభ్యం

పవన్ కళ్యాణ్ తన ట్వీట్‌లో పేర్కొంటూ, ఈ పాస్ వ్యవస్థ టోల్ చెల్లింపుల ప్రక్రియను సులభతరం చేయడమే కాకుండా, వాహనదారులకు ఆర్థికంగా ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారులపై తరచూ ప్రయాణించే వ్యక్తులకు ఇది సమయం, ధన వ్యయాన్ని తగ్గించనుందని పేర్కొన్నారు.

కేంద్రానికి కృతజ్ఞతలు .. ఇది ప్రజాపాలనకు నిదర్శనం

ఈ నిర్ణయంతో ప్రయాణికుల డిమాండ్‌కు సరైన పరిష్కారం లభించిందని పవన్ అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా సున్నితమైన, వేగవంతమైన, ఎలాంటి వివాదాలకు తావులేని విధంగా హైవే ప్రయాణం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజాపాలన పట్ల కేంద్ర ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు ఇది ప్రతీక అని పవన్ కళ్యాణ్ కొనియాడారు.

మార్గదర్శకాలు ఇంకా విడుదల కావలసిన పరిస్థితి

ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి ఫాస్టాగ్ వార్షిక పాస్‌లు అందుబాటులోకి రానున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది. ఈ పాస్ ద్వారా దేశవ్యాప్తంగా హైవే ప్రయాణాల్లో మరింత వినూత్నత, వేగం, సౌలభ్యత తీసుకురావడం లక్ష్యంగా ఉందని గడ్కరీ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే.

అయితే, కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతానికి కార్లు, జీపులు, వాన్‌ల వంటి వాణిజ్యేతర వాహనాలకు మాత్రమే వర్తించేలా ఈ పాస్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, దీనికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు, నిబంధనలు ఇంకా వెల్లడించాల్సి ఉంది.

# బీచ్ రోడ్‌లో ఘనంగా యోగాంధ్ర



అమరావతి, జూన్ 19: కేంద్ర ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో విశాఖలోని బీచ్ రోడ్ లో యోగాంధ్ర ఘనంగా నిర్వహించారు. వాకథాన్ ముగిసిన అనంతరం విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇక్కడ మంత్రులు, అధికారులు ప్రజలతో కలిసి వివిధ యోగాసనాలను వేశారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని, ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని ఈ సందర్భంగా మంత్రులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం 'యోగాంధ్ర' లక్ష్యాలను ప్రజలకు మరింత చేరువ చేసిందని నిర్వాహకులు భావిస్తున్నారు.

ఈ యోగాంధ్ర కార్యక్రమంలో విశాఖ జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, సవిత, ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడుతో కలిసి నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పాల్గొని యోగాసనాలు వేశారు.

విశాఖలో అన్ని స్కూళ్లకు రెండు రోజులు సెలవు : డీఈవో

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖలోని అన్ని స్కూళ్లకు ఈనెల 20, 21వ తేదీల్లో సెలవులు ఇస్తున్నట్లు డీఈవో ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ రెండు రోజులు ప్రతి స్కూల్లో విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రైవేట్, గవర్నమెంట్ స్కూళ్లో విధిగా ఉత్తర్వులు అమలు చేయాలని ఆదేశించారు.

# భారత ప్రధాని, అమెరికా అధ్యక్షుడి మధ్య టెలిఫోన్ సంభాషణపై విదేశాంగ కార్యదర్శి ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 19:జీ7 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత ప్రధానమంత్రి శ్రీ మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భేటీ కావాల్సి ఉంది. అయితే, అధ్యక్షుడు ట్రంప్ ముందుగానే అమెరికాకు తిరిగిరావాల్సి వచ్చింది. దీంతో సమావేశం జరగలేదు.

అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అభ్యర్థన మేరకు వారిద్దరూ ఫోన్లో సంభాషించారు. దాదాపు 35 నిమిషాల పాటు వీరిద్దరి మధ్య సంభాషణ సాగింది.

ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత ప్రధానమంత్రి శ్రీ మోదీతో ఫోన్లో మాట్లాడి సంతాపం తెలిపారు. ఉగ్రవాద వ్యతిరేక పోరులో భారత్‌కు మద్దతు తెలిపారు. దాని తర్వాత వారిద్దరూ మాట్లాడుకోవడం ఇదే మొదటిసారి.

ఆపరేషన్ సిందూర్ గురించి ట్రంప్‌తో ప్రధానమంత్రి మోదీ వివరంగా మాట్లాడారు. ఏప్రిల్ 22 తర్వాత ఉగ్రవాద వ్యతిరేక కార్యాచరణ దిశగా భారత్ తన దృఢ సంకల్పాన్ని యావత్ ప్రపంచం దృష్టికి తెచ్చినట్లు భారత ప్రధానమంత్రి మోదీ... అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దృష్టికి తెచ్చారు.

మే 6,7 తేదీల్లో అర్ధరాత్రి సమయంలో పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలు, రహస్య స్థావరాలను మాత్రమే భారత్ లక్ష్యంగా చేసుకుందని ప్రధానమంత్రి మోదీ చెప్పారు.

భారత్ చాలా స్పష్టమైన, కచ్చితమైన, తీవ్రతరం కాని విధంగా చర్యలు తీసుకుంది. పాక్ ఎలాంటి దురాక్రమణ చర్యలకు పాల్పడినా దీటుగా బదులిస్తామని భారత్ స్పష్టం చేసింది.

మే 9వ తేదీ రాత్రి అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ భారత ప్రధానమంత్రి మోదీకి ఫోన్ చేశారు. భారత్‌పై పాకిస్థాన్ భారీ దాడికి పాల్పడే అవకాశముందని వాన్స్ హెచ్చరించారు. ఒకవేళ అదే జరిగితే భారత్ మరింత దీటుగా బదులిస్తుందని ప్రధానమంత్రి మోదీ ఆయనతో స్పష్టంగా చెప్పారు.

మే 9-10 రాత్రి పాకిస్థాన్ దాడికి భారత్ బలంగా, నిర్ణయాత్మకంగా బదులిచ్చింది. ఇది పాక్ సైన్యానికి భారీ నష్టం కలిగించింది. వారి సైనిక వైమానిక స్థావరాలు పనిచేయకుండా పోయాయి. భారత్ దృఢతర చర్యల వల్ల.. సైనిక చర్యలను నిలిపివేయాల్సిందిగా చివరికి పాకిస్థాన్ బతిమాలుకోవాల్సి వచ్చింది.

ఈ మొత్తం సంఘటనల్లో ఏ దశలోనూ భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చలుగానీ, భారత్-పాక్ మధ్య అమెరికా మధ్యవర్తిత్వం కోసం ప్రతిపాదన గానీ ఏదీ జరగలేదని భారత ప్రధానమంత్రి మోదీ... అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో స్పష్టంగా చెప్పారు. పాక్ అభ్యర్థన మేరకే, ఇరుదేశాల సాయుధ దళాల మధ్య ఉన్న సమాచార మార్గాల ద్వారా నేరుగా భారత్, పాకిస్థాన్ మధ్యే సైనిక చర్య నిలుపుదలపై చర్చ జరిగింది. మధ్యవర్తిత్వాన్ని భారత్ అంగీకరించలేదని, ఇకపై అంగీకరించబోదని ప్రధానమంత్రి మోదీ స్పష్టం చేశారు. ఈ విషయంపై భారత్‌లో పూర్తి రాజకీయ ఏకాభిప్రాయం ఉంది.

ప్రధానమంత్రి మోదీ చెప్పిన అంశాలను సావధానంగా విన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉగ్రవాదంపై భారత్ పోరాటానికి మద్దతు తెలిపారు. ఇకపై భారత్... ఉగ్రవాదాన్ని పరోక్ష యుద్ధంగా చూడబోదని, దాన్ని యుద్ధంగానే పరిగణిస్తుందనీ మోదీ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోందన్నారు.

కెనడా నుంచి తిరిగొస్తున్న సమయంలో ప్రధానమంత్రి మోదీ అమెరికాలో ఆగే అవకాశముందా అని ట్రంప్ అడిగారు. అయితే, కొన్ని కార్యక్రమాలు ముందుగానే నిర్ణయించి ఉండడంతో రాలేకపోతున్నట్లు ప్రధానమంత్రి మోదీ చెప్పారు. త్వరలోనే సమావేశానికి ఏర్పాట్లు చేసుకోవాలని వారిద్దరూ నిర్ణయించుకున్నారు.

ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఘర్షణపైనా అధ్యక్షుడు ట్రంప్, ప్రధానమంత్రి మోదీ చర్చించారు. రష్యా - ఉక్రెయిన్ మధ్య శాంతి నెలకొనాలంటే ఇరు పక్షాల మధ్య నేరుగా చర్చలు అత్యావశ్యకమని, ఈ దిశగా నిరంతర ప్రయత్నాలు జరగాల్సిన అవసరం ఉందని వారిద్దరూ అంగీకరించారు.

ఇండో-పసిఫిక్ ప్రాంతంపట్ల తమ ఆలోచనలను వారిద్దరూ పంచుకున్నారు. ఈ ప్రాంతంలో క్వాడ్ పాత్ర అత్యంత ప్రధానమైందన్నారు. తదుపరి క్వాడ్ శిఖరాగ్ర సదస్సుకు భారత్ రావాల్సిందిగా ప్రధానమంత్రి మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఆహ్వానించారు.

ఈ ఆహ్వానాన్ని అంగీకరించిన ట్రంప్.. భారత పర్యటన కోసం తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు.

# దేశవ్యాప్తంగా యోగా మహాకుంభ్ ఆవిష్కృతం

న్యూఢిల్లీ, జూన్ 19:ఈనెల 21న జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం (ఐడీవై)-2025 కోసం కౌంట్‌డౌన్ ప్రారంభమైన సందర్భంగా, యోగా మహా కుంభ్ పేరుతో దేశవ్యాప్తంగా యోగా వేడుకలు జరుగుతున్నాయి. ఈ జాతీయ ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ, మూడు రోజుల యోగా మహా కుంభ్ ఈరోజు న్యూఢిల్లీ ఆర్‌కె పురంలోని హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రంలో ఘనంగా ప్రారంభమైంది. హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రం సహకారంతో.. కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (నిజీజీనిఏజీర్), మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా (ఎమ్‌డీఎన్ఐవై) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ధ్యానం, సమాజ సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చేలా రూపొందించిన వివిధ యోగా ప్రదర్శనలు, ఆరోగ్య సదస్సులు, మానసికోల్లాసాన్ని కలిగించే సాంస్కృతిక ప్రదర్శనలు ఇందులో భాగంగా ఉంటాయి.

ఉత్సాహభరితమైన నుక్కడ్ నాటక ప్రదర్శన ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నాటకంలో భాగంగా యోగా ఔత్సాహికులు నిత్య జీవితంలో యోగా ప్రాముఖ్యతను ప్రేక్షకులకు వివరించారు. శారీరక సౌలభ్యం నుంచి మానసిక ప్రశాంతత వరకు యోగా వల్ల కలిగే ప్రయోజనాలను చక్కగా ప్రదర్శించారు. సమతుల జీవనశైలి కోసం యోగాను అభ్యసించేలా ప్రేక్షకులను ప్రేరేపించారు.

మరో ప్రధాన యోగా మహా కుంభ్ కార్యక్రమం ఈనెల 15న లదాఖ్‌లోని ఎత్తయిన కొండలపై స్వచ్ఛమైన వాతావరణంలో ప్రారంభమైంది. లదాఖ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ యోగా అండ్ మెడిటేషన్ (ఐఎఎమ్‌వైఎమ్)-2025 ఇప్పటికే పాంగోంగ్ లేక్ (13,000లకు పైగా అడుగుల ఎత్తు), నుబ్రా వ్యాలీ, సింధు ఘాట్, ఎమ్ఐఎమ్‌సీ దేవచన్ క్యాంపస్ వంటి అద్భుత ప్రదేశాలకు యోగాను పరిచయం చేయడం ద్వారా యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఈ సంవత్సరం "యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్" అనే శక్తిమంతమైన సందేశంతో.. ఆయుష్ మంత్రిత్వ శాఖ, మహాబోధి అంతర్జాతీయ ధ్యాన కేంద్రం (ఎమ్ఐఎమ్‌సీ), యూటీ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ లదాఖ్, ఎల్ఏహెచ్‌డీసీ లేహ్, అనుబంధ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఉత్సవం విజయవంతమైంది.

రెండో యోగా మహా కుంభ్ కార్యక్రమం కూడా ఈనెల 15న ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని నోయిడాలోని సెక్టార్ 50లో అర్హమ్ ధ్యాన్ యోగ్ ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా యువత, కుటుంబాలకు సెక్టార్ 78లోని వేద్ వాన్ పార్కులో హరిత్ యోగా సమావేశాలు, వ్యాసరచన.. చర్చా పోటీలు, అందరూ కలిసి పాలుపంచుకునే పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నెల 21న సెక్టార్ 33ఎలోని శివాలిక్ పార్కులో దేశవ్యాప్తంగా జరిగే యోగా సంగమ్ వేడుకలకు అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఐడీవై-2025 ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తూ.. ఇదే సమయంలో అర్హమ్ ధ్యాన్ యోగ్ ప్రపంచవ్యాప్తంగా సమావేశాలను కూడా నిర్వహిస్తోంది.

లదాఖ్‌లోని ఎత్తయిన శిఖరాల నుంచి ఢిల్లీలోని సాంస్కృతిక కేంద్రాలు, నోయిడాలోని ఆహ్లాదకరమైన స్థానిక ఉద్యానవనాల వరకు, యోగా మహా కుంభ్-2025.. భారత యోగ వారసత్వాన్ని శక్తిమంతమైన, సమ్మిళిత వేడుకగా ఆవిష్కృతం చేస్తుంది. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలను శ్వాస - సమతుల్యతతో ఐక్యం చేయడం ద్వారా ఈ కార్యక్రమాలు.. యోగాకు గల సార్వత్రిక ఆకర్షణను, ఆరోగ్యకంమైన, మరింత సామరస్యపూర్వకమైన ప్రపంచాన్ని రూపొందించడంలో భారత్ నాయకత్వాన్ని పునరుద్ఘాటిస్తున్నాయి. అన్ని కార్యక్రమాలు ప్రజలందరినీ ఆహ్వానిస్తూ.. పెద్దసంఖ్యలో పౌరులు పాల్గొనేలా, యోగాను వారి జీవన విధానంగా స్వీకరించేలా ప్రోత్సహిస్తున్నాయి.

# ఉమ్మడి ప్రాధాన్యతలకు మరింత ప్రాముఖ్యం ఇచ్చే లక్ష్యంతో గ్లోబల్ సౌత్ నేతలతో ప్రధానమంత్రి సమావేశాలు

న్యూఢిల్లీ, జూన్ 19:జూన్ 17న కెనడా కననాస్కిస్ లో జరిగిన జీ-7 శిఖరాగ్ర సమావేశాల నేపథ్యంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభివృద్ధి చెందుతున్న దేశాల నేతలతో సమావేశమయ్యారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు శ్రీ సిరిల్ రామాఫోజా, బ్రెజిల్ అధ్యక్షుడు శ్రీ లూయిజ్ ఇనాసియో లులా డిసిల్వాతో భేటీ కావడమే కాకుండా, సుహృద్భావపూర్వక వాతావరణంలో అర్థవంతంగా చర్చలు జరిగాయి.

గ్లోబల్ సౌత్ దేశాల వాణిని వినిపించడంలో భారత్ నిబద్ధతను శ్రీ మోదీ పునరుద్ఘాటించారు.

"ఎక్స్" వేదికపై బ్రెజిల్ అధ్యక్షుడు చేసిన పోస్టుకి ప్రతిస్పందిస్తూ..."ప్రియ మిత్రులు... దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రామాఫోజా, బ్రెజిల్ అధ్యక్షుడు లులాతో ప్రత్యేకంగా మాట్లాడాను. గ్లోబల్ సౌత్ దేశాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాల పట్ల మాది తిరుగులేని నిబద్ధత. మరింత మెరుగైన.. నిర్మాణానికి అవసరమైన అన్ని చర్యలనూ చేపట్టేందుకు మేం సిద్ధం" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

# మస్కట్‌లో ఇబ్బందులు పడుతున్న మహిళ.. క్షేమంగా ఇంటికి రప్పించిన పోలీసులు



హైదరాబాద్, జూన్ 19:మస్కట్ లో ఇబ్బందులు పడుతున్న జిల్లాలోని చామలమర్రికి చెందిన హుస్సైనమ్మను జిల్లా పోలీసులు క్షేమంగా రప్పించారు. కొద్ది రోజుల క్రితం జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాకు మస్కట్‌లో ఉన్న హుస్సైనమ్మ ఒక సెల్ఫీ వీడియోను పంపింది. ఆ వీడియోలో ఆమె తీవ్రమైన మనస్తాపంతో ఉన్నానని, తాను ఇక బతకలేనని, తనను కాపాడాలని వేడుకున్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ వెంటనే ఆళ్లగడ్డ పోలీసులను అప్రమత్తం చేశారు.

ఆమెకు సంబంధించిన వివరాలు సేకరించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


ఈవిషయంలో వెంటనే స్పందించిన ఆళ్లగడ్డ పోలీసులు సంబంధిత ఏజెంట్లతో, మిగిలిన వ్యక్తులతో సంప్రదించి ఆమె కోసం విమాన టికెట్లను బుక్ చేయించారు. సమాచారం అందిన 48గంటలలోనే ఆమెను గుర్తించి, తిరుగు ప్రయాణ ఏర్పాట్లు చేసి, చాగలమర్రిలో ఆమె కుటుంబానికి సురక్షితంగా చేర్చారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ మార్గనిర్దేశంలో ఆళ్లగడ్డ పోలీసులు చూపిన శీఘ్ర స్పందన, చక్కటి నిర్వహణ మహిళల రక్షణ పట్ల నంద్యాల జిల్లా పోలీసుల కమిట్మెంట్ టు విమెన్ సేఫ్టీ స్పష్టంగా చాటుతోందన్నారు. ఆ మహిళని క్షేమంగా ఇంటికి చేర్చారు.


## కొప్పర్తి పుస్తకాల ఆవిష్కరణ

జూన్ 29, 2025 ఆదివారం సాయంత్రం 6 గంటలకు

సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియం
బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్, హైదరాబాద్


అధ్యక్షత
శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు
ప్రముఖ కవి, విమర్శకులు, చిత్రకారులు



చరిత్ర, సామాజిక వ్యాసాల సంపుటి
సంభాషణ

ఆవిష్కరణ ఆచార్య వకుళాభరణం రామకృష్ణ
ప్రముఖ చరిత్రకారులు

విశ్లేషణ శ్రీ దూసనపూడి సోమసుందర్
జాతీయ కార్యదర్శి, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్



మూడు కవిత్వ సంపుటాల సంకలనం
కొప్పర్తి కవిత్వం

ఆవిష్కరణ డా. పాపినేని శివశంకర్
కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారగ్రహీత

విశ్లేషణ శ్రీ దర్భశయనం శ్రీనివాసాచార్య
ప్రముఖ కవి, విమర్శకులు

యువకవుల స్పందన కట్టా సిద్దార్థ
కడలి

అందరికీ ఆహ్వానం
సాహితీమిత్రులు, హైదరాబాద్

# చిత్తశుద్ధితో పని చేస్తున్నాం..

**-ఏపీని అభివృద్ధికి చిరునామాగా మారుస్తాం**
**-ఏడాది సుపరిపాలనపై ప్రగతి నివేదిక**
**-సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం ముందుకెళ్తోంది**



అమరావతి, జూన్ 19:'రాజకీయాల్లో, ప్రభుత్వంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలి. అలా నిరంతరం పరితపించే నేను గత సంవత్సర కాలంలో చేపట్టిన శాఖల ద్వారా చేసిన అభివృద్ధిని, సాధించిన విజయాలను ప్రజలందరి ముందు ఉంచడం నా నైతిక బాధ్యత. అధికార బాధ్యతలు స్వీకరించి సంవత్సరం అయిన సందర్భంగా ఈరోజు మీ ముందుకు తీసుకొస్తున్నాను..' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణ, అటవీ, సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రిగా పవన్‌కళ్యాణ్ బాధ్యతలు చేపట్టి గురువారంతో సంవత్సరం పూర్తైన సందర్భంగా సమగ్ర అభివృద్ధి నివేదిక విడుదల చేశారు. దీనితో పాటు పవన్‌కళ్యాణ్ ఓ లేఖను 'ప్రియమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు గత సంవత్సరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయానికి అండగా నిలబడి, రాష్ట్రాన్ని బానిస సంకెళ్ల నుండి విముక్తి చేసిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను..' అని ఆయన పేర్కొన్నారు. 2019 నుండి 2024 వరకు ఐదేళ్ల కాలంలో రాష్ట్రం నియంతృత్వ పాలకుల పాలనలో నలిగిపోయింది, అభివృద్ధికి దూరమైంది, శాంతిభద్రతలు క్షీణించాయి, యువత భవిష్యత్తుపై నీలి మేఘాలు కమ్ముకున్నాయి, మహిళలకు రక్షణ కరువైం దని తెలిపారు. రాష్ట్ర రాజధాని నిర్మాణంలో ఒక్క ఇటుక కూడా కదలకుండా నిర్మానుష్యంగా మారిన సమయంలో రాష్ట్రాన్ని రక్షించేందుకు, రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిపాలనను పునరుద్ధరించేందుకు నరేంద్ర మోదీ నేతృత్వంలో, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ప్రజల పక్షాన ఎల్లవేళలా నిలబడి పోరాడే మన సమిష్టి సహకారంతో ఎన్‌డీఏ కూటమి 164 అసెంబ్లీ సీట్లను గెలిచి 94% స్ట్రైక్ రేట్ తో చారిత్రాత్మక విజయం సాధించిందన్నారు. ఇంతటి గెలుపును అందించిన ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు, మళ్లీ రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అహర్నిశలు కృషి చేస్తూ సంవత్సర కాలంలోనే గత ఐదేళ్లలో జరగని అభివృద్ధిని చేసి చూపిస్తూ, ప్రజల్లోనే కాకుండా, పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని నింపడానికి కృషి చేశామన్నారు.

### సుపరిపాలనకు కేంద్ర సహకారం:

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, సుపరిపాలనను చూసి నేడు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారాలు అందిస్తుండటంతో రాష్ట్రం అన్ని రంగాల్లో సమిష్టి అభివృద్ధి సాధిస్తూ స్వర్ణాంధ్ర 2047 సాధించే దిశగా అడుగులు వేస్తుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ: పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల సమగ్ర నివేదికను ప్రజలందరూ నిశితంగా పరిశీలించి ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, మీరు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేయాలనే మా సంకల్పాన్ని గుర్తిస్తారని ఆశిస్తున్నాను అని ఆయన పేర్కొన్నారు.

### గత ఐదేళ్లలో నియంతృత్వ పాలన..:

గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రం నియంతృత్వ పాలకుల పాలనలో నలిగిపోయిందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి ఏడాదిగా చిత్తశుద్ధితో పని చేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై పవన్ కళ్యాణ్ ప్రగతి నివేదికలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఎన్డీయే కూటమి విజయానికి అండగా నిలబడిన ప్రతిఒక్కరికీ, అలానే రాష్ట్రాన్ని బానిస సంకెళ్ల నుంచి విముక్తి చేసిన ప్రతిఒక్కరికీ పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు తెలిపారు.

### పెట్టుబడిదారుల్లో విశ్వాసం నింపాం..:

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చేవారిలో విశ్వాసం నింపామని అలానే కేంద్ర ప్రభుత్వం కూడా అభివృద్ధి కార్యక్రమాలకు అండగా నిలుస్తోందని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుభవం, దూరదృష్టి నాయకుని పాలనలో రాష్ట్రం ముందుకెళ్తోందని అన్నారు. రాబోయే నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధికి చిరునామాగా మారుస్తామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.

## తెలంగాణ రైతాంగం తరపున పోరాటానికి రెడీ అయిన బీఆర్ఎస్ పార్టీ

**-బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో కెసిఆర్ ఉన్నతస్థాయి సమావేశం**

హైదరాబాద్ జూన్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ చూపిస్తున్న ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంపై తెలంగాణ రైతాంగం తరపున పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ రెడీ అయింది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యంపై చర్చించేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యంలో త్వరలోనే కీలక సమావేశాన్ని ఏర్పాటు చేయబోతున్నది. బీఆర్ఎస్ ముఖ్య నాయకులు హాజరయ్యే ఈ ఉన్నతస్థాయి సమావేశంలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అలసత్వం, రైతు వ్యతిరేక వైఖరిపై ప్రధానంగా చర్చిస్తారు. రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మౌనం వహించడంపైన చర్చించనున్నారు. బీఆర్ఎస్ హయాంలో 90 శాతం పూర్తి అయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కనబెట్టడంతో పాటు 2 పిల్లర్లు కుంగాయన్న సాకుతో మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను నాయకులకు కేసీఆర్ వివరిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో లక్షల ఎకరాల్లో రైతులకు సాగునీరు అందకుండా పోతున్నది. రాజకీయ దురుద్దేశంతోనే అన్నదాతల పైన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కక్ష కట్టినట్లు వ్యవహరిస్తున్న నేపథ్యంలో తదుపరి కార్యాచరణ పై చర్చించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకుండా ప్రభుత్వం చూపుతున్న అలసత్వం వలన తెలంగాణకు తీరని నష్టం కలుగుతుందని, ఈ అంశంలో ఉద్యమ కార్యాచరణకు బీఆర్ఎస్ ప్రణాళికలు సిద్ధం చేయనుంది. ఏడాదిన్నర కాలంగా తెలంగాణ రైతులను నిండా ముంచుతున్న కాంగ్రెస్ ద్రోహాన్ని ఈ కీలక సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సమగ్రంగా చర్చించనున్నారు.

## బోనకల్లు పోలీస్ స్టేషన్ ను సందర్శించిన అడిషనల్ డీసీపీ లాఅండ్ఆర్డర్




ఖమ్మం, జూన్ 19 (నేటినిజం ప్రతినిధి) :బోనకల్లు పోలీస్ స్టేషన్ ను అడిషనల్ డీసీపీ లాఅండ్ఆర్డర్ ప్రసాదరావు సందర్శించారు. గురువారం పోలీస్ స్టేషన్ కు చేరుకున్న ఆయన పోలీస్ స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు, విచారణలో వున్న కేసులు, చార్జిషీట్, ఫంక్షనల్ వర్టికల్స్, 5ఎస్ అమలు, హెచ్ఆర్ఎంఎస్, జనరల్ డైరీ రికార్డులు, కేసుల్లో వున్న వాహనాలను పరిశీలించారు. రిసెప్షన్, పిటిషన్ విచారణలకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. స్టేషన్ హౌస్ మేనేజ్‌మెంట్, పోలీస్ స్టేషన్ సెక్టార్ ఆఫీసర్ల భాధ్యతలు తదితర అంశాలను పరిశీలించారు. పెట్రో కార్, బీట్ డ్యూటీ సిబ్బంది ఏవిధమైన విధులు నిర్వహిస్తున్నారు.. పాత నేరస్థుల నివాసాలను కదలికలను ఏవిధంగా గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సరిహద్దుల నుండి అక్రమ రవాణా ను నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ..వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు.

# పార్టీ శ్రేణులను పరామర్శిస్తే తప్పా?

**-వైఎస్ఆర్ సిపి పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్**



అమరావతి జూన్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): వైఎస్ఆర్ సిపి పార్టీ శ్రేణులను పరామర్శిస్తే తప్పా?, ఎందుకు ఇన్ని ఆంక్షలు? అని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. మొన్నటి పొదిలి పర్యటనలోనూ తనకు ఇబ్బందులు సృష్టించారని మండిపడ్డారు. గురువారం జగన్ మీడియాతో మాట్లాడారు. 40వేల మందిపై రాళ్లు వేసే ప్రయత్నం చేశారని, రైతులు సంయమనం పాటించారని, అయినా కేసులు పెట్టారని, రైతులను చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎందుకు భయపడుతున్నారని నిలదీశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే భూస్థాపితం చేస్తారా? టాపిక్ డైవర్ట్ చేయడానికే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేశారని చురకలంటించారు. తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వనని అన్నందుకు చెవిరెడ్డి గన్‌మెన్‌ను హింసించారని, ఆ గన్‌మెన్ స్వయంగా డిజిపి, రాష్ట్రపతికి లేఖలు రాయాల్సి వచ్చిందన్నారు. చెవిరెడ్డి కుమారుడిని కూడా ఈ కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని, లిక్కర్ కేసులో సంవత్సరం నుంచి చెవిరెడ్డి భాస్కర్ పేరే లేదన్నారు. చంద్రగిరిలో ఎదురు ఉండకూడదనే చెవిరెడ్డిపై కేసులు పెట్టారని జగన్ ఆరోపణలు చేశారు. సడెన్‌గా గిరి అనే కానిస్టేబుల్‌ను తెరపైకి తీసుకొచ్చారని, ఇరికించాలనుకుంటే ఎవరినైనా ఇరికించొచ్చన్నారు. లిక్కర్ కేసులో లేని ఆధారాలను తయారు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పిన్నెల్లిపైనా తప్పుడు కేసులు పెట్టారని, నందిగం సురేష్‌పైనా కేసుల మీద కేసులు పెడుతున్నారని, వల్లభనేని వంశీని 60రోజులుగా జైలులో పెట్టారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని బీహార్‌ను చేయడంలో చంద్రబాబుకు మించిన గొప్ప నాయకుడు ఎవరూ లేరని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ఫ్యూలాంటి పరిస్థితుల మధ్య తన పర్యటన జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## గాంధీ భవన్‌లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు




హైద్రాబాద్ జూన్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో గాంధీ భవన్ లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు జరిగాయి.. ఈ సందర్బంగా మెట్టు సాయికుమార్ తో పాటు నేతలు రాహుల్ గాంధీ చిత్రపటానికి పులమాలలువేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు.

స్వీట్స్ వంచి పెట్టారు. ఈ సందర్బంగా మెట్టు సాయి కుమార్ ఆధ్వర్యం లోస్కూల్ పిల్లకి బుక్స్ తో పాటు పెన్ పెన్సిల్ లు నేతలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమం లో పార్టీ సీనియర్ నాయకుడు వీ హనుమంత రావు వీరితో పట్టు సెలబ్రేషన్స్ లో పాల్గొన్న ఎంఎల్సీ అమిర్ ఆలీఖాన్, కార్పొరేషన్ చైర్మెన్ రియాజ్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు

## మైక్రోసాఫ్ట్‌లో మరో రౌండ్ లేఆఫ్స్.. వేలాది మందిపై ప్రభావం..!

హైదరాబాద్ జూన్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇప్పటికే వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా మరో రౌండ్ లేఆఫ్స్‌కు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మైక్రోసాఫ్ట్‌లో మరో రౌండ్ లేఆఫ్స్.. వేలాది మందిపై ప్రభావం..! పడీ అవకాశం లేకపోలేదు. ఆర్థిక అస్థిరత, పెరుగుతున్న కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం వల్ల టెక్ ఇండస్ట్రీలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ లాంటి దిగ్గజ కంపెనీ లు వందల మంది ఉద్యోగులను ఇంటికి పంపాయి. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 130 కంపెనీలు కలిసి 61 వేల మంది ఉద్యోగులను తొలగించాయి. ఇక ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇప్పటికే వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా మరో రౌండ్ లేఆఫ్స్‌కు సిద్ధమైనట్లు తెలుస్తోంది. 2025 ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో మైక్రోసాఫ్ట్ మరోసారి ఉద్యోగుల కోతకు సిద్ధమైనట్లు బ్లూమ్‌బర్గ్ నివేదించింది. కంపెనీ పునర్నిర్మాణంలో భాగంగా వేలాది మందిపై వేటు వేయనున్నట్లు తెలిపింది. తాజా రౌండ్ సేల్స్ విభాగంలో ఉండనున్నట్లు సంస్థ అధికారులను ఉటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది. అయితే, ఈ లేఆఫ్స్‌పై మైక్రోసాఫ్ట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. కాగా, మైక్రోసాఫ్ట్ ఈ ఏడాది మే నెల మధ్యలో వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తమ సిబ్బందిలో మూడు శాతం మందికి లేఆఫ్‌లు ఇచ్చింది. అంటే దాదాపు 6వేల మందిని తొలగించింది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు. మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడమే ముఖ్య లక్ష్యమని సంస్థ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఇక ఈ ఏడాది జనవరిలో కూడా పనితీరు ఆధారంగా కొంతమందిని సంస్థ తొలగించిన విషయం తెలిసిందే. ఈనెల ఆరంభంలో కూడా పలువురిపై సంస్థ వేటు వేసింది. డైనమిక్ మార్కెట్‌లో పోటీదారుగా నిలవడానికి, కంపెనీ పునర్ నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవడానికి కోతలు తప్పడం లేదని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. 'మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తున్నాం' అని మైక్రోసాఫ్ట్ తెలిపింది.

## మహిళలు, యువతులు ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా సంప్రదించండి

**– ఏహెచ్టియు ఇన్స్పెక్టర్ నటేష్**




రాజన్న సిరిసిల్ల, జూన్ 19:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణ పరిధిలోని అపరెల్ పార్క్ పని చేస్తున్న మహిళలకు జిల్లా జిల్లా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటియు ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ మహిళలు, చిన్న పిల్లల రక్షణ విషయంలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో మానవ అక్రమ రవాణాను నిర్మూలించడానికి జిల్లాలో ఏహెచ్టియు ఏర్పాటు చేయడం జరిగిందని, మహిళలపై అత్యాచారం, అసభ్యంగా దాడి చేయడం, అనుచితంగా తాకడం మొదలైన లైంగిక నేరాల కేసులలో, మానవ అక్రమ రవాణాను నిరోదించడం లో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ప్రత్యేకత కలిగి ఉంది అన్నారు. మహిళా భద్రతకు కొరకు షి టీమ్స్ ఏర్పాటు ద్వారా ఎన్నో రకాల కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థినీలు, యువతులు, మహిళలకు అవగాహన కల్పిస్తూ నిరంతరం వారికి అందుబాటులో ఉంటున్నదని చెప్పారు. మహిళలు యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, నేరుగా సంప్రదించలేని వారు డయల్100 , ఎహెచ్టియు ఇన్స్పెక్టర్ 87126 56392,జిల్లా షీ టీమ్ 87126 56425 కి సమాచారం ఇవ్వగలరని, వివరాలు గోప్యంగా ఉంచడతాయని అన్నారు.

## శ్రీకోటమైసమ్మ ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం




ఖమ్మం, జూన్ 19: (నేటినిజం ప్రతినిధి): ఐసిడిఎస్ కారేపల్లి మండలం భాగ్యనగర్ సర్కిల్ లో గురువారం సింగరేణి మండలంలోని ఉసిరికాయలపల్లిలో ఉన్న గొల్లగూడెం నర్సరీ టూ మినీ అంగన్వాడీ కేంద్రం పరిధిలో ఉన్న మూడు సంవత్సరాల వయస్సు గల పిల్లలకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం శ్రీ కోట మైసమ్మ అమ్మవారి దేవస్థానంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐసిడిఎస్ సూపర్వైజర్ మాలతి కుమారి మాట్లాడుతూ...ఎల్కేజీ బుక్స్ గురించి, ఆటపాటలతో పిల్లలకు చదువు ఎలా నేర్పిస్తారు, వర్క్ బుక్స్ ఎలా రాయిస్తారు, పిల్లలకు అంగన్వాడి కేంద్రాలు మంచి పోషక ఆహారం ప్రతిరోజు గుడ్డు, ఆకుకూరలు, పప్పుతో ఆహారం పెడతాము, అలాగే మంచి క్రమశిక్షణతో చదువు నేర్పిస్తాము, కాబట్టి అంగన్వాడి కేంద్రానికి విూ పిల్లల్ని పంపించగలరని చెప్పడం జరిగింది, అలాగే పోస్టల్ డిపాజిట్ నుంచి వచ్చిన తల్లులందరికీ సుకన్య సమృద్ధి యోజన పథకం గురించి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ పర్సా పట్టాభి రామారావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి నిరంజన్, యుపిఎస్ స్కూల్ హెచ్ఎం కె.శ్రీలత, టీచర్స్ బి.పద్మ విఓ అధ్యక్షురాలు డి.జ్యోతి ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు, గుగులోతు రాజు, అర్జున్, చిరంజీవి, అరుణ్, ఈసా బిక్షమయ్య, పిల్లల తల్లులు, అంగన్వాడీ టీచర్స్ వి.అరుణ కుమారి ఏం.రాంబాయి, ఎల్.శ్వేత, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# కేసీఆర్ లేకుంటే, తెలంగాణ తేకుంటే రేవంత్ రెడ్డి ఎక్కడ..?

**-రేవంత్ రెడ్డికి సాగునీటి అవసరాల గురించి ఏ మాత్రం అవగాహన లేదు..**
**-చంద్రబాబుకు ఎందుకు లేఖ రాయడం లేదు?**
**-మండిపడ్డ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**



హైదరాబాద్ జూన్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టేందుకే ఎక్కువ ప్రయత్నం చేస్తున్నది అని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. బనకచెర్ల ద్వారా ఆంధ్రాకు సాగునీటిని తరలించుకుపోయే ప్రయత్నాలకు ఈ ప్రభుత్వం సహకరిస్తుంది అని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించిన తర్వాతనే ఈ ప్రభుత్వం బనకచెర్ల విషయంలో స్పందించింది. అఖిలపక్ష సమావేశంలో రాజకీయాలు మాట్లాడడంతో పార్టీ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆయన సమావేశం నుండి బయటకు వచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎంపీ, పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అయిన వద్దిరాజును కించపరిచినట్లు రేవంత్ రెడ్డి మాట్లాడారు. సీఎంకు ఈ విషయంలో ఏదో పాండిత్యం ఉన్నట్లు మాట్లాడారు. బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి ఏదో సాధించినట్లు వారిని పొగిడారు అని నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు.

### సీఎం రేవంత్ రెడ్డి అవగాహనా రాహిత్యానికి నిదర్శనం..

కేంద్ర అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఒప్పందంగా చిత్రీకరించడం సీఎం రేవంత్ రెడ్డి అవగాహనా రాహిత్యానికి నిదర్శనం.. సమావేశంలో ఎవరు ఏం మాట్లాడినా రికార్డ్ చేస్తారన్న విషయం తెలియకపోవడం విడ్డూరం. మొత్తం సమావేశంలో బనకచర్లను ఖచ్చితంగా అడ్డుకుని తీరతాం అన్న విషయాన్ని రేవంత్ రెడ్డి ఎందుకు చెప్పడం లేదు.. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.32,500 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ నిధులు ఖర్చు చేసింది.. ఇక్కడ కేవలం 172 ఎకరాలు మాత్రమే సేకరించాల్సి ఉంది.. ప్రాజెక్ట వనులు దాదాపు పూర్తయ్యాయి. పాలమూరు కరువును శాశ్వతంగా రూపుమాపే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వం వెనక్కు పంపింది. మిగిలిన పనులు పూర్తి చేసి వెంటనే నీటి కేటాయింపులు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిని పట్టించుకోవడం లేదు అని నిరంజన్ రెడ్డి నిప్పులు చెరిగారు.

### ముఖ్యమంత్రి హోదాకు అది తగదు..

రేవంత్ మాట్లాడే భాష ఆయనకు అందంగా అనిపించవచ్చు.. కానీ ముఖ్యమంత్రి హోదాకు అది తగదు.. మీరు మాట్లాడే భాష మీ వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది. కృష్ణా నీళ్ల విషయంలో తెలంగాణ ఇప్పటికే నష్టపోయింది.. తెలంగాణ పోరాటమే నీళ్ల కోసం జరిగింది.. ఏపీలో కేవలం తెలుగుగంగకు మాత్రమే నీటి కేటాయింపు ఉంది.. కానీ ఆంధ్రాలో 300 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లు నిర్మించుకున్నారు.. ప్రస్తుతం కృష్ణా నదిలో తగినంత నీరు అందుబాటులో లేదు. కృష్ణా బేసిన్‌కు కాళేశ్వరం ద్వారా సాగునీటిని తరలించాలన్న ఆలోచన కేసీఆర్‌కు ఉన్నది. తెలంగాణ ప్రయోజనాలు, ఇక్కడి అవసరాలు తీరిన తర్వాత మిగిలిన ప్రాంతాలకు సాగునీరు ఇస్తామని కేసీఆర్ అన్నారు.. దీనికి నిన్న, నేడు, రేపు ఎప్పటికి కట్టుబడి ఉంటాం అని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.

### కేసీఆర్ లేకుంటే, తెలంగాణ తేకుంటే రేవంత్ రెడ్డి ఎక్కడ..?

కేసీఆర్ లేకుంటే, తెలంగాణ తేకుంటే రేవంత్ రెడ్డి ఎక్కడ ఉండేవాడు.. ప్రతి అంశంలో తెలంగాణను కించపరిచి, తెలంగాణను అవహేళన చేసి మాట్లాడడం తగదు.. ఇదొక మానసిక రుగ్మత అనిపిస్తుంది. అఖిలపక్షంలో ప్రతిపక్ష పార్టీలను ఎందుకు పిలుస్తారు? ప్రభుత్వ ఉద్దేశం ఏంటో చెప్పాలి.. కానీ అధికారుల ముందు రాజకీయాలు ఎలా మా?ట్లాడతారు? బనకచెర్ల ప్రాజెక్టు నేపథ్యంలో నాగార్జున సాగర్ కాలువలను వెడల్పు చేస్తున్నది.. ఇది రాష్ట్ర విభజన చట్టానికి వ్యతిరేకం.. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా నిలదీయడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా సాగునీటి పంపకాలు, ప్రాజెక్టుల గురించి అపెక్స్ సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కోరడం లేదు? అపెక్స్ సమావేశం ఏర్పాటు చేయకుంటే ప్రాజెక్టులకు అనుమతులు ఎలా వస్తాయి? అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు.

బనకచర్ల ప్రాజెక్టుకు ఎలాంటి ఫీజుబులిటీ లేకున్నా ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించగానే రూ.82 వేల కోట్లు ఖర్చయ్యే పథకానికి ఏకంగా 50 శాతం భరిస్తామని హామీ ఇవ్వడం దేనికి నిదర్శనం.. తెలంగాణ మీద బీజేపీకి ఉన్న కక్షకు ఇది నిదర్శనం.. ఇది తెలంగాణకు గొడ్డలిపెట్టు. కనీసం తెలంగాణను సంప్రదించాలన్న ఉద్దేశం కూడా కేంద్రానికి లేదు. నదుల అనుసంధానం కింద ఇది ఇంటిగ్రేట్ అవుతుందని ఏపీ కేంద్రాన్ని ఒప్పించుకుంది. తెలంగాణ ప్రభుత్వానికి అధికారం మీద తప్ప ప్రజాప్రయోజనాలు, ప్రాంత ప్రయోజనాల మీద ముందు చూపు లేదు.

## సాయిరామ్ హాస్పిటల్స్‌లో ఘనంగా వరల్డ్ కిడ్నీ క్యాన్సర్ డే అవగాహన కార్యక్రమం

**- ఖమ్మంలో మొట్టమొదటి సారిగా ఫ్రీ కాన్సర్ సెకండ్ ఒపీనియస్ క్లినిక్, ఈఎంఐ ఫెసిలిటీ ఢీఫీవర్ క్లినిక్ ప్రారంభించిన సాయిరామ్ హాస్పిటల్స్**
**ముఖ్య అతిథిగా హాజరైన ఖమ్మం జిజి హెచ్‌ఉప్రభుత్వ వైద్య కళాశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్ కుమార్**
**- అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న వందకు పైగా స్టూడెంట్స్**

ఖమ్మం, జూన్ 19 (నేటినిజం ప్రతినిధి) :ప్రపంచ కిడ్నీ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా సాయిరామ్ హాస్పిటల్స్ ప్రాంగణంలో కిడ్నీ క్యాన్సర్ అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కిడ్నీ క్యాన్సర్ గురించి ప్రజలలో అవగాహన కల్పించడం, ముందస్తు గుర్తింపును ప్రోత్సహించడం, రోగులు, వారి కుటుంబాలకు నిపుణుల సంప్రదింపుల ద్వారా మద్దతు అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ సునీల్ కుమార్ జంగాలా ఆధ్వర్యంలో సాయిరామ్ హాస్పిటల్ వైద్య నిపుణులు, కిడ్నీ క్యాన్సర్ లక్షణాలు, ప్రమాద కారకాలు, నివారణ, చికిత్స గురించి సమాచారాన్ని అందించారు. ఖమ్మం జిజిహెచ్ ఉప్రభుత్వ వైద్య కళాశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్ కుమార్ మాట్లాడుతూ..."గత కాలంలో అంటువ్యాధులు చాలా ఎక్కువగా ఉండేవి, ఇప్పుడు అవి తగ్గుముఖం పట్టి, కాన్సర్ సంబంధిత వ్యాధులు ఎక్కువయ్యాయి, కాన్సర్ మహమ్మారిలా మారి ప్రాణాంతకం కాకముందే గుర్తించి చికిత్స పొందడం ఉత్తమం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్ కుమార్ జంగాల ఎం.డి తో పాటు డాక్టర్ స్వాతి జంగాల చైర్మన్, శ్రీధర్ జంగాల–డైరెక్టర్, డాక్టర్ వెంకటేష్ సి.ఈ.ఓ, డాక్టర్ విజేష్ వర్మ నెఫ్రోలోజిస్ట్ డాక్టర్ వెంకటేష్ పున్న సర్జికల్ ఆంకాలజిస్ట్‌డాక్టర్ త్రిశూల్ రెడ్డి జనరల్ ఫిషిషియన్ పాల్గొన్నారు.

